batukammanews.com TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

20 ఆగస్టు 2026
గురువారం

# అంధకారంలో బీడీ వర్కర్స్ కాలనీ

### నాలుగు రోజులుగా వెలగని వీధి దీపాలు.

### కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా.. లైట్లు మాత్రం కరువు

### రాత్రివేళల్లో బయటకు రావాలంటే జంకుతున్న కాలనీవాసులు.

బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో గత నాలుగు రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో కాలనీ లోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు చీకటి మయంగా మారడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.ఇటీవల కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినప్పటికీ వాటికి వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.





విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన వెంటనే వీధి దీపాలు అమర్చాలని సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు వాపోతున్నారు. కాలనీలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో రాత్రి సమయంలో చీకటి కారణంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా చీకటి కారణంగా రహదారిపై గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు అమర్చి కాలనీకి వెలుగులు తీసుకురావాలని వారు కోరుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

### జిల్లా ఇంచార్జి మంత్రిని

## మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.



ఇంచార్జ్ తహసిల్దార్లుగా జూనియర్స్

2017 బ్యాచ్ గాకుండా 2021 వారికి

డివిజన్‌కు ఒకరు ముగ్గురు జూనియర్లే

ఆవేదనలో సీనియర్లు

# రెవెన్యూ మతలబు ఏంటో..?

నిజామాబాద్, బతుకమ్మ: జిల్లాలోని రెవిన్యూ శాఖలో సీనియర్లను గాదని జూనియర్లకు బాధ్యతలు అప్పగించడంపై అంతర్గతంగా ముసలం రాజుకుంటున్నట్లు తెలుస్తోంది. మండలంలో తహసిల్దార్ గా విధులు నిర్వహించేందుకు ఉవ్విళ్ళూరుతుంటారు. అవకాశం కోసం చూసినా .. ఆదరించేవాళ్ళు లేకపోవడంతో ఎక్కడ పంపిస్తే అక్కడ పని చేయాల్సి వస్తోంది కొందరికి. ఇంకొందరేమో పైరవిలతో పాటు ఒప్పందం చేసుకున్న ప్రకారం అనుకున్న పోస్ట్ లలో కూర్చుంటున్నారు. జిల్లాలో 2017 బ్యాచ్ కు చెందినవారు సుమారు పది మంది వరకు ఉండగా, 2021 బ్యాచ్ వారికి తహసిల్దార్ పోస్టులు కట్టబెట్టడం వెనుక తతంగాలే నడిచినట్లు రెవిన్యూ వర్గాలు భావిస్తున్నాయి.

**డివిజన్ కు ఒక్కరు:**

జిల్లాలో మూడు డివిజన్ లు ఉండగా, నిజామాబాద్ లో నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ లో నందిపేట్, బోధన్ లో రెంజల్ మండలాల్లో ఉన్న డిప్యూటి తహసిల్దార్లే ఇంచార్జ తహసిల్దార్లుగా కొనసాగుతున్నారు. వీళ్ళు పని చేసే కేంద్రానికి మరొకరు రాకుండా జాగ్రత్త పడుతూ తమ సీటును కాపాడుకుంటున్నారనే మాటలు వినబడుతున్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత సొంత జిల్లాకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశిస్తే, తానూ ఇక్కడే ఉంటానని చెప్పిన డి టి కి నిజామాబాద్ రూరల్ బాధ్యతలు అప్పజెప్పారు. 317 కింద కామారెడ్డి జిల్లాకు వెళ్ళిన డి టి, నిజామాబాద్ జిల్లాకు రెండేళ్ళ ఒప్పందంతో డిప్యుటేషన్ పై వచ్చాడు. నందిపేట్ లో విధుల్లో చేరిన కొన్ని రోజుల నుంచే తానే ఇంచార్జ తహసిల్దార్ అని చెప్పుకొస్తూనే, తన కలను సాకారం చేసుకున్నాడని ఆ శాఖలోని వారే చర్చించుకుంటున్నారు. రెంజల్ లో ఉన్న తహసిల్దార్ కు లైసనింగ్ ఆఫీసర్ గా నియమించడంతో, స్థానిక డి టి ఇంచార్జ్ బాధ్యతలను మోస్తున్నాడు.

**ముగ్గురు జూనియర్లే:**

డివిజన్ కు ఒక్కరు మూడు మండలాల్లో కొనసాగుతున్న ఇంచార్జ్ తహసిల్దార్లు 2021 బ్యాచ్ కు చెందిన జూనియర్లు. వీరికన్నా ఐదేళ్ళు సీనియర్లు ఉన్నప్పటికీ, జూనియర్లలోని ఈ ముగ్గురికే ఇంచార్జ్ ఇవ్వడం వెనుక మతలబు ఏంటో అనే ప్రశ్నలు మెదలాడుతున్నాయి. ఇందులో ఒకరు నాయకులతో ముందుగా మాట్లాడుకొని ఇంచార్జ్ తహసిల్దార్ ఇప్పిస్తే మీరు చెప్పిన పనులను చక్కబెడతానని వచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఆవేదనలో సీనియర్లు:**

జిల్లాలో కీలకమైన పోస్ట్ లలో జూనియర్లను నియమించడంతో సీనియర్లు ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఆ సీటులో కూర్చునే అవకాశం వస్తుందో, రాదో అని వారి సమకాలికులతో ముచ్చటించుకుంటున్నారు. ప్రస్తుత కాలంలో మృత్యువు ఎలా కబలిస్తుందో తెలియదు.. అంతలోపు మండలాధికారి అయ్యే అవకాశాలు రావాలని ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. పైరవీలు చేతగాదు, నాయకుల చెంత భజన చేసే అలవాటు లేనందువల్లే తమకు తహసిల్దార్ భాగ్యం కలగట్లేదని 2017 బ్యాచ్ వాళ్ళు ఒకరికొకరు ఓదార్పు మాటలు మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సీనియర్ల మోర ఆలకిస్తారేమో చూడాలి మరి.

### సీసీఆర్ బి సెక్షన్‌లో

## సమగ్ర సమీక్ష నిర్వహించిన సీపీ

### సీసీఆర్ బి సెక్షన్‌లో సమగ్ర సమీక్ష నిర్వహించిన సీపీ



నిజామాబాద్ క్రైం , బతుకమ్మ : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని సీసీఆర్.బి సెక్షన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ సందర్భంగా సీ.సీ.ఆర్.బి సెక్షన్‌లో నిర్వహిస్తున్న కేసుల నమోదు, నేర గణాంకాలు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, పోలీస్ స్టేషన్ల నుంచి అందుతున్న కేసుల వివరాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు.

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

### అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి

### పిఎసి సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క

నిజామాబాద్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పిఎసి సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల ఎంకే గార్డెన్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క తో పాటు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నాయకులు ముందుండాలని ఆమె అన్నారు.టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి కమిటీలను మరింత క్రియాశీలం చేసి ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని అన్నారు. పార్టీ కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని ఆయన అన్నారు. పార్టీని గ్రామస్థాయి నుండి కొరకు జిల్లా స్థాయి వరకు పటిష్టంగా నిర్మాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లో పార్టీ సశీస్థ గత నిర్మాణాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీకి సంబంధించిన ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికి సేవలు అందించాలన్నారు.

# ఓడ్ల కృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

## బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా

బాన్సువాడ బతుకమ్మ : కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ ఓడ్ల మహేందర్ తమ్ముడు ఓడ్ల కృష్ణ మంగళవారం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.కృష్ణ మృతి విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ మైలారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా షేక్ జుబేర్ మాట్లాడుతూ, ఆప్తుడిని కోల్పోయిన కుటుంబానికి తన సానుభూతి వ్యక్తం చేశారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. కృష్ణ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని కృష్ణ కుటుంబానికి సానుభూతి తెలిపారు.



## ఉచిత కంటి వైద్య శిబిరంను

# ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### ఎంపీడీఓ సంతోష్ కుమార్

భీమ్ గల్, బతుకమ్మ :లయన్స్ క్లబ్ భీమ్ గల్--వేముగల్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిభిరంను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గోనుగొప్పుల గ్రామంలో లయన్స్ క్లబ్ అఫ్ భీమ్ గల్ బివేముగల్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎంపిడీఓ గ్రామ సర్పంచ్ చరణ్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సంతోష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు . పేద ప్రజలకు కంటి సమస్యలు ఉంటే వైద్యం చేయించుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. ఈ శిభిరం కంటి శస్త్ర చికిత్స అవసరమైన ఉచితంగానే చెస్తారని, ఇట్టి అవకాశంను అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు 126 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 23 మందికి మోతిబిందు ఆపరేషన్ అవసరమని గుర్తించారు.మోతిబిందు ఆపరేషన్ అవసరమైన వారిని లయన్స్ క్లబ్ భీమ్ గల్--వేముగల్లు ఆధ్వర్యంలో లయన్స్ కంటి ఆసుపత్రి ఆర్మూర్ కు తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని క్లబ్ మెంబెర్స్ తెలిపారు.

ఆపరేషన్ అనంతరం పేషంట్ ను తిరిగి గ్రామానికి తీసుకువచ్చి ఇంటి వద్ద వదలడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.ప్రజలు లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీవో నరసయ్య, శిబిరం ఇన్చార్జ్ లయన్. హనుమంతరావు, లయన్స్ అధ్యక్షుడు లయన్.డాక్టర్ పడాల పురందర్, ఉపాధ్యక్షుడు లయన్.టి. హనుమాన్లు, పీఆర్వో లయన్. పురస్తు బద్రి, లయన్ మంద గోవర్ధన్, లయన్ గాండ్ల సాగర్, లయన్ దని రమేష్, లయన్ ర్యాడా శ్రీనివాస్, లయన్ భూక్యా లింబాద్రి, వార్డు సభ్యులు,లయన్స్ క్లబ్ సభ్యులు, మాజీ సర్పంచ్ భోజగౌడ్,సెక్రటరీ శ్రీనివాస్,వార్డు సభ్యులు శేఖర్ , స్వామి నాయక్ , మహేష్ , హరీష్ ,గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



ఈ సమావేశంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యే మదన్ మోహన్, సునీల్ రెడ్డి, వినయ్ రెడ్డి, యూసుఫ్ అలీ, కాసుల బాలరాజ్, అరికెల నర్సారెడ్డి , ఆకుల లలిత, కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, కార్పొరేషన్ చైర్మన్లు మోహన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, కేశ వేణు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీసీఆర్ బి సెక్షన్‌లో

# సమగ్ర సమీక్ష నిర్వహించిన సీపీ

పోలీస్ స్టేషన్ ల వారీగా కేసుల వివరాలను సమీక్షిస్తూ , పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేసులకు సంబంధించిన రికార్డులు , గణాంకాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.అలాగే నేరాలపై సమగ్ర గణాంకాలను సిద్ధం చేసి , వాటి ఆధారంగా నేర నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. సీ.సీ.ఆర్.బి విభాగం , పోలీస్ స్టేషన్ల మధ్య సమన్వయం మరింత మెరుగుపరచి , కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని కమిషనర్ సూచించారు.కేసుల దర్యాప్తు, పురోగతికి సంబంధించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు సకాలంలో అందిస్తూ , పోలీసు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా కొనసాగించేలా సీసీఆర్బీ సిబ్బంది బాధ్యతాయు తంగా విధులు నిర్వహించా లని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , సి.సి.ఆర్.బి ఏ.సి.పి బి. గురు నాయుడు, సిఐ ఆర్. అంజయ్య , పాండేరావు, ఎస్సై వరప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# వేల్పూర్ లో ఘనంగా ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం

వేల్పూర్, బతుకమ్మ :ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవ కార్యక్రమాన్ని ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. 187 వరల్డ్ ఫోటోగ్రాఫర్స్ డే సందర్భంగా లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులార్పించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ జమల గారి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ రాము, ట్రెజరర్ గంగాధర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి

## జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా





నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఒక ఫోటో వేల మాటలు చెప్పగలదు

## ఫోటో జార్నలిస్టుల సేవలు అమోఘం

## ప్రపంచ ఫోటో గ్రఫీ డే లో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఒక ఫోటో వేల మాటలు చెప్పగలదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ప్రెస్ క్లబ్ లో బుధవారం ప్రెస్ ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటో గ్రఫీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ అంటే కేవలం కెమెరా ఆపరేటర్ కాదని, సమాజంలో జరిగే మంచి, చెడు, చారిత్రక సంఘటనలను భవిష్యత్ తరాలకు భద్రపరిచే వారన్నారు. చరిత్రలోని ఎన్నో ముఖ్య ఘట్టాలు ఫోటోల ద్వారానే మనకు గుర్తుండిపోతాయన్నారు. ప్రకృతి విపత్తులు, సామాజిక కార్యక్రమాలు,



ప్రజా సమస్యలు, విజయాలు, ప్రతి అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకం అని చెప్పారు.

**జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కృషి**

జర్నలిస్టుల చిరకాల వాంఛ ఇళ్ళ స్థలాల కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. నిజామాబాద్ జర్నలిస్టుల్లో ఐక్యత ఉంటుందని, ఇదే ధోరణితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రతన్, ప్రధాన కార్యదర్శి భానూతేజ, గౌరవ అధ్యక్షుడు గోవిందరాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుభాష్, కోశాధికారి రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, సీనియర్ ఫోటో గ్రాఫర్ బాలరాజు, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు నాగేష్, సీనియర్ ఫోటో గ్రాఫర్లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు పురస్కారం

## ప్రిన్సిపాల్ ను సన్మానించిన జిల్లా ఇంటర్ విద్యా అధికారి




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ కు ఉత్తమ సేవలకు పురస్కారం లభించిందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. బుధవారం ఉదయం బాలికల కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ అడ్మిషన్లు, ఫలితాలు, పచ్చదనం, పరిశుభ్రత, కళాశాల పాలన, నిర్వహణ, ఇతర సాంకేతిక, కళాశాల పనుల నిర్వహణలో ఉత్తమ సేవలకు ఈ పురస్కారం లభించిందని అన్నారు. విద్యార్థినిలు మంచి కళాశాల వాతావరణంలో విద్యనభ్యసించడానికి ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ కృషి చేస్తున్నారని అభినందించారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పని తీరు, విద్యార్థుల ప్రతిభను పెంపొందించ డంలో ప్రతి ఒక్కరు కృషి చేసారని, దాని ఫలితమే ఈ అవార్డ్ అని ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ అన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పని తీరు వల్లే 80శాతం కు పైగా ఫలితాలను సాధించామని, అలాగే అడ్మిషన్ లను 1400 లకు పైగా వచ్చాయి అని అన్నారు. తన ఆధ్వర్యంలో కళాశాలను ఒక బృందా వనంలా తయారు చేయడానికి తమ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు సహకరించడం వల్లే ఈ అవార్డ్ సాధ్యమైందని ప్రిన్సిపాల్ అన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిపించాలి

## బస్టాండ్ డివిజనల్ మేనేజర్‌కి టీజీవీపీ వినతి



నిజమాబాద్ అర్బన్, బతుకమ్మ : హాస్టల్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ అధ్వర్యం లో బస్టాండ్ డివిజనల్ మేనేజర్ కి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కళ్యాణ్ మాట్లాడుతూ న్యాల్ కల్ రోడ్డులోని ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందుల పై మేనేజర్ కు వివరించామన్నారు. విద్యార్థులు లిఫ్ట్ సాయంతో పాఠశాలకు వెళ్తున్నారని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కావున హాస్టల్ దగ్గర బస్ ఆపాలని అదే విధంగా ఆర్ ఆర్ చౌరస్తా లో దించడం, ఎక్కించుకోవడం చేసేలా డ్రైవర్స్ కి, కండక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీని పై ఆర్టీసీ బస్టాండ్ మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి రాజరాజేంద్ర చౌరస్తా వద్ద బస్సులు ఆపేలా, అలాగే డిపో-2 నుండి వచ్చే బస్సులను హాస్టల్ ముందు నిమిషం పాటు నిలిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన బస్టాండ్ మేనేజర్ కి ప్రత్యేక ధన్యవాదాలు . ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా కార్యదర్శి వినయ్ కార్యకర్తలు సాయి, గణేష్ , ఉదయ్ సాయి ,అనూష తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని షబ్బీర్ అలీకి వినతి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని 11వ డివిజన్ బహుజన కాలనీ దొడ్డి కొమురయ్య నగర్ విష్ణు నగర్ ఇబ్రహీం నగర్,అసద్ బాబా నగర్, దాదాపు 2వేల కుటుంబాల దాహార్తిని తీర్చేందుకు స్థలం కేటాయిం చాలని కోరుతూ 11వ డివిజన్ కార్పొరేటర్ కరీం, అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ కి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రజలతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 11వ డివిజన్ కార్పొరేటర్ కరీం అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ స్థానిక ప్రజలు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి రెవెన్యూ అధికారులకు తెలియజేసినప్పటికీ, అధికారులు స్థలం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నందిగుట్ట ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ట్యాంక్ నిర్మాణం జరిపేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు, దాని ప్రక్కనే మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ కాలేజ్ లో 800 మంది విద్యార్థినీలు ఉన్నారని త్రాగునీరు, కనీస అవసరాలు తీర్చేందుకు వాటర్ ట్యాంకర్ల ద్వారా మున్సిపల్ నీటిని పంపించాల్సి వస్తుందని అన్నారు, వాటర్ ట్యాంక్ నిర్మాణం జరిగితే డివిజన్ ప్రజలతో పాటు హాస్టల్ విద్యార్థినిల సమస్య కూడా పరిష్కారం అవుతుందని అన్నారు వెంటనే అధికారులు స్పందించి స్థలాన్ని పబ్లిక్ హెల్త్ అధికారులకు వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం అప్పగించాలని కోరారు, సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ సలహాదారులు స్థల సేకరణ కోసం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బహుజన కాలనీ నాయకులు మారుతి, ఇబ్రహీం, మహబూబ్, అప్సర్, దొడ్డి కొమరయ్య నగర్ నాయకులు అమూల్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ

20 ఆగస్టు 2026 గురువారం

హెడ్ కానిస్టేబుల్ తిరుపతి

## అంత్యక్రియలకు హాజరైన సీపీ

కుటుంబ సభ్యులను ఓదార్చిన సీపీ



ఆర్మూర్, బతుకమ్మ : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెంజల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ తలారి తిరుపతి మంగళవారం ఆకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెందారు. తిరుపతి ప్రస్తుతం ఆర్మూర్ ఎ.సి.పి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతి పట్ల పోలీస్ శాఖలో విషాదం నెల కొంది. ఈ నేపథ్యంలో తలారి తిరుపతి అంత్యక్రియలు బుధవారం ఆర్మూర్‌లో నిర్వహించారు. అంత్యక్రియలకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హాజరయ్యారు. పార్థివ దేహానికి పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి , వారి బాధను పంచుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తలారి తిరుపతి మృతి పోలీస్ శాఖకు తీరని లోటని , ఆయన ఆత్మకుశాంతి చేకూరాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు. అంత్యక్రియల్లో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ, బోధన్ రూరల్ సిఐ విజయబాబు, రెంజల్ ఎస్సై గంగాధర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకిల్ పాషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భీమ్ గల్ మున్సిపల్ సాధారణ సమావేశం




భీమ్ గల్,బతుకమ్మ :భీమ్ గల్ మున్సిపల్ సాధారణ సమావేశాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం మున్సిపల్ పరిధిలో మొత్తం 56 అంశాలతో కూడిన తీర్మానాలను చదివి వినిపించారు. మొత్తం 56 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి,చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి, పారిశుద్ధ్య, ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలు, మున్సిపల్ పరిపాలన, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో సూచించారు. సమావేశం వివరాలను మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్ వెల్లడించారు. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ సంటిలత,కౌన్సిలర్లు ఆరెపల్లి శ్రీజ, పర్ష కుశలత,తోట సతీష్,గుణాల బాలలక్ష్మి,బోదిరే లావణ్య, అంజుమ్ ఆలీ,సందీప్, నీలం రవి, సంగ్మా నాయక్,వివిధ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కలహాలు లేకుండా కలిసి వెళ్తేనే కలకాలం గుర్తుంటారు

–ఎపిపి రహీమోద్దీన్ కు "బార్ "ఘనవీడ్కోలు







నిజామాబాద్ లీగల్, బతుకమ్మ :న్యాయస్థానాలలో ప్రాసిక్యూషన్, డిఫెన్స్ కౌన్సిల్స్ మధ్య క్రిమినల్ కేసులలో వారివారి ప్రధాన్యతలదృష్ట్యా వాడివేడిగా వాదనలు జరుగుతాయని అవి కోర్టు గౌరవమర్యాదలకు అనుగుణంగా ఉంటాయని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠ రావు అన్నారు. పదకొండు సంవత్సరాల పైచిలుకు సుధీర్ఘాకాలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహించిన అనంతరం హైదరాబాద్ ఎల్ బి నగర్ కోర్టుకు బదిలీపై వెళుతున్న మహమ్మద్ రహీమోద్దీన్ కు నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ కార్యాలయంలో శాలువా మెమొంటోతో సన్మానించి ఘనవీడ్కోలు పలికిన సందర్భంలో నీలకంఠ రావు మాట్లాడారు. ఆర్మూర్, బాన్స్ వాడ, బోధన్, బిచ్ కుంద, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులలో దాదాపు అన్ని కోర్టులలో విధులు నిర్వహించడం ముదావహామని అన్నారు. పోలీసుల తరపున బలంగా వాదనలు వినిపించడం ప్రాసి క్యూషన్ విధి అని అంతకం తకు బలంగా ముద్దాయిల తరపున వాదనలు వినిపించడం న్యాయ వాదుల వృత్తి ధర్మమని ఎవరి పరిధిలో వారు పని చేసుకుంటు వెళతారని వెళ్లే క్రమంలో వ్యక్తిగత పట్టింపులకు తావు లేదని నీలకంఠ రావు తెలిపారు. ప్రాసిక్యూషన్ ప్రయోజనాల కోసం ప్రాసిక్యూటర్స్, డిఫెన్స్ న్యాయవాదులుగా న్యాయవా దులు ఎవరి ప్రయోజనాల కోసం వారు శ్రమిస్తారని అంతిమంగా కోర్టులు న్యాయ నిర్ణయం చేస్తాయని ఆయన తెలిపారు. సీనియర్ న్యాయ వాదులు మంతెన రాజేందర్ రెడ్డి, జివి కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ రహీమోద్దీన్ ను పాలమూరి పిల్లగా డిగా గానే చూశామని వృత్తిరీత్యా బార్ మధ్య తిరిగిన ఆయన తన వృత్తిలో నిబద్ధత్తతోనే మెదిలారని అన్నారు. న్యాయమూర్తులైన, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అయిన ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా వచ్చినవారిని కుటుంబ సభ్యుల మాదిరిగానే గౌరవించుకున్నామని వారు పేర్కొన్నారు. వృత్తిపరంగా వచ్చిన వారం దరిని ఇంటికి అతిథులు వచ్చిన తీరుగానే చూసి ఆదరించామని వారు గుర్తు చేశారు. అనంతరం బార్ తరపున రహీమోద్దీన్ దంపతులను మెమెంటో శాలువతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి,న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేధార్, షేర్ సుభాష్,మాణిక్ రాజు, పడిగల వెంకటేష్వర్, బైర గణేష్, ఎర్రం విగ్నేష్, పెండెమ్ రాజు, బిట్ల రవి, మెట్టు నరేష్ కుమార్, యునస్ ఖాన్, ఆశ నారాయణ, బోయిని సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీ తెరిపించేందుకు

# వెయ్యి ట్రాక్టర్లతో రైతు ఉద్యమం చేపడతాం

చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ కన్వీనర్ ఆకుల పాపయ్య





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : మూతపడిన ఎన్సిఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించుకునేందుకుగాను రాబోయే రోజుల్లో 1000 ట్రాక్టర్లతో రైతు ఉద్యమం చేపడతామని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో గల హరిత నగర్ లో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయం, శ్రామిక విజ్ఞాన కేంద్ర కార్యాలయాల ప్రారంభ సభలో పాపయ్య, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయాన్ని రైతు నాయకులు జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా కార్యదర్శి కొట్టే గంగాధర్, శ్రామిక విజ్ఞాన కేంద్ర కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పాపయ్య మాట్లాడుతూ గత 16 సంవత్సరాల క్రితం అప్పటి పాలక ప్రభుత్వాలు చక్కెర పాలసీలు, అవినీతి అధికారుల మూలంగా ఫ్యాక్టరీని మూసివేసారని అన్నారు. అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలకు ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పి ఓటు బ్యాంకు గా మారిందని మండిపడ్డారు. ఫ్యాక్టరీ తెరిపిస్తామంటూ ఈ ప్రాంత రైతుల కు హామీ ఇవ్వడం తర్వాత మర్చిపోవడం అన్ని పార్టీలకు ఆనవాయితీగా మారిందని రైతులను నమ్మించి మోసం చేస్తున్న ప్రభుత్వాలకు ఈ ఉద్యమం ఒక హెచ్చరికగా మారుతుందని వారన్నారు. ఈ ప్రాంత రైతులంతా చెరుకు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని ముందు ఫ్యాక్టరీని ప్రభుత్వం తెరిపిస్తామని రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై ఉందని వారన్నారు. దేశంలో బెల్లానికి మంచి డిమాండ్ ఉన్నందున పైగా బెల్లానికి జీఎస్టీ కూడా లేనందున ఈ ఫ్యాక్టరీ బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడిపించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫ్యాక్టరీ ప్రారంభానికి గాను 100 కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని వారు కోరారు. ఇప్పటికే 40 గ్రామాలలో రైతుల సమావేశాలు జరిగాయని వారంతా చెరుకు పెట్టేందుకు ముందు వస్తున్నారని ప్రభుత్వం ఇప్పుడు చెరుకు పెడతాలేరని పసలేని మాటలు మాట్లాడుతూ రైతులను గందరగోళనికి చేస్తున్నారని అన్నారు. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు శాసనసభ్యులు పార్లమెంట్ సభ్యులు అధికార పార్టీ నేతలు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు లు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి లు ముందుకు రావాల్సిన అవసరం ఉందని వారు కోరారు. ఇంకా ఈ సమావేశంలో రైతు నాయకులు కొట్టే గంగాధర్, దూపల్లి లక్ష్మారెడ్డి, ఎఫ్ పి ఓ చైర్మన్లు పృథ్వీరాజ్,వినయ్ కుమార్, అగ్గు చిన్నయ్య, ఏఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, పీ ఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఆకుల అరుణ, కార్పొరేటర్లు నిర్మల శ్రావణ్, బంటు రాము, సిర్పూర్ గంగారెడ్డి, టేక్మాల్ లక్ష్మణ్, టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత, కానాపూర్ కోటయ్య, నర్సారెడ్డి, కే గోపాల్, ఎస్ కే అబ్దుల్, జిల్లా కార్యదర్శి మొద్దు సుప్రియ, మారుతి, జిల్లా కార్యదర్శి సాయి రెడ్డి,ఆకుల నారాయణ, ర్యాపని గంగాధర్, సూర్య శివాజీ, ఇఫ్ట్ జిల్లా అధ్యక్షులు బచ్చు భూమయ్య, గంగాధర్, వనమాల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## తెయూ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా డా. మహేందర్ ఐలేని



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం నూతన విభాగాధిపతిగా డా. మహేందర్ ఐలేని, (అసిస్టెంట్ ప్రొఫెసర్) నియమితులయ్యారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య టి. యాదగిరి రావు ఆదేశాల మేరకు డాక్టర్ మహేందర్ కు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం. యాదగిరి ఉత్తర్వులు అందచేశారు.డా. మహేందర్ గతంలో విభాగాధిపతి గా, చైర్పర్సన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ గా, చీఫ్ వార్డెన్ హాస్టల్స్ గా, యూజీసీ కోఆర్డినేటర్ గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గా, యూజీ ఎగ్జామ్స్ కాన్ఫిడెన్షియల్ గా, సారంగాపూర్ బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ గా సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేందర్ ను బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

# భీమ్‌గల్ అభివృద్ధిని తొక్కిపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

**సీఎం విలాసాలకు వందల కోట్లు,భీంగల్ అభివృద్ధికి నిధులు లేవా?**
**బీఆర్ఎస్ 75% పనులు పూర్తి చేసిన బిల్లులు ఆపి మిగిలిన 25% పనులను పడకేయించిన రేవంత్ సర్కార్.**
**పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ 3 నెలల ఎన్నికల హామీ ఏమైంది?..**
**6 నెలలైన ఒక్క రూపాయి నిధులు రాలేదు.**
**భీమ్‌గల్ అభివృద్ధి సాధించే వరకు పోరాటం ఆగదు.**
**భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై ఇకపై భీమ్ గల్ ప్రజలే మార్గదర్శనం చేయాలి.**
**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**





భీమ్‌గల్, బతుకమ్మ :గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, మెజారిటీ పనులు పూర్తి చేసిన ప్రజా ప్రయోజనకర అభివృద్ధి ప్రాజెక్టులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిధులు కేటాయించకుండా,నిర్లక్ష్యం చేస్తూ భీమ్ గల్ పట్టణ అభివృద్ధిని తొక్కిపట్టిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీయర్ఎస్ హయాంలో 75 శాతం పనులు పూర్తి చేసి, నిధులు ఇవ్వక నిలిచిపోయిన 100 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ యార్డ్, అంతర్గత సీ సీ రోడ్లు, ఆర్టీసీ బస్సు డిపో, కాంగ్రెస్ నాయకులు కంకర పోసి వదిలేసిన రోడ్లను బుధవారం ఆయన పట్టణ బీయర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ గత కాంగ్రెస్ పాలనలో మూతపడ్డ వ్యవస్థలను తాము అధికారంలోకి వచ్చాక పునరుద్ధరిస్తే, నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తూ, బిల్లులు నిలిపివేసి భీమ్‌గల్ అభివృద్ధిని తిరోగమనం వైపు నడిపిస్తోందని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ పాలనలో మూతపడిన భీమ్‌గల్ ఆర్టీసీ బస్ డిపోను, బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో రూ.2.25 కోట్లతో సమగ్ర మరమ్మతులు చేయించి పునరుద్ధరించామని తెలిపారు.

డిపో మేనేజర్‌ను నియమించి బస్సు సర్వీసులను విజయవంతంగా నడిపించామని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే డిపోను మళ్లీ నిరుపయోగంగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అక్కడ కేవలం ఒక చౌకీదార్ మాత్రమే ఉన్నారని, ప్రాంగణమంతా పిచ్చిమొక్కలు మొలిచి, కూలిన ప్రహరీ గోడను కూడా బాగు చేయలేని దయనీయ స్థితిలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఈ సమస్యపై అసెంబ్లీ లో గళమెత్తిన, క్షేత్రస్థాయిలో పోరాడిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. భీమ్‌గల్ పట్టణ పరిధిలో ఇప్పటికే రూ.25 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ పనులను విజయవంతంగా పూర్తి చేశామని గుర్తు చేస్తూ,మిగిలిన గల్లీల అభివృద్ధి కోసం ఎన్నికల ముందే అప్పటి మంత్రి కేటీఆర్ సహకారంతో మరో రూ.10 కోట్లు (ఫంక్షన్ హాల్ తదితర పనులతో కలిపి మొత్తం రూ.12 కోట్లు) బడ్జెట్ ద్వారా మంజూరు చేయించి, టెండర్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు.మున్సిపల్ ఎన్నికల వేళ హడావుడిగా కొబ్బరికాయలు కొట్టి కంకర పోసిన కాంగ్రెస్ పాలకులు, గత 7-8 నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పనులన్నీ అర్ధాంతరంగా నిలిచిపోయాయని విమర్శించారు.పట్టణ ప్రజలు, చిరువ్యాపారుల సౌకర్యార్థం రూ.3.50 కోట్లతో ఆధునిక మార్కెట్ నిర్మాణాన్ని ప్రారంభించి 50 శాతానికి పైగా పనులు పూర్తి చేయించామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించామని, మిగిలిన సుమారు రూ.80 లక్షల నుంచి రూ.1 కోటి పెండింగ్ బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పనులు ఆగిపోయి, నేడు ఆ ప్రాంగణం పందుల సంచారానికి, పిచ్చిచెట్లకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. భీమ్ గల్ లో నిబంధనల ప్రకారం 30 పడకలకే అవకాశం ఉన్నప్పటికీ, మారుమూల ప్రాంత పేద ప్రజల వైద్య అవసరాల కోసం నాటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావులను ఒప్పించి రూ.35 కోట్లతో 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందులో రూ.22 కోట్లు భవన నిర్మాణానికి, మిగతా నిధులు వైద్య పరికరాలకు కేటాయించామని తెలిపారు.ఎన్నికలకు ముందే కేవలం 15 నెలల్లోనే నెలకు రూ.1 కోటి చొప్పున సుమారు రూ.15 కోట్ల విలువైన పనులు పూర్తి చేయించి, కాంట్రాక్టర్‌కు రూ.13.50 కోట్ల మేర బిల్లులు ఇప్పించామని వివరించారు.మొత్తం ప్రాజెక్టులో 70 నుండి 75 శాతం పనులు తామే పూర్తి చేయగా, మిగిలిన 25 శాతం పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం వద్దకు వెళ్తే.. అసెంబ్లీ వేదికగా వైద్యారోగ్య శాఖ మంత్రి రూ. 5 కోట్లు ఇస్తామని చెప్పి కేవలం రూ. 2.27 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. గత 6 నెలలుగా నేను ప్రభుత్వాన్ని వివిధ రూపాల్లో ప్రశ్నిస్తుంటే కేవలం రూ. 30 లక్షల విలువైన నామమాత్రపు పనులు (టైల్స్, ఫ్లోరింగ్) మినహా మిగతా నిర్మాణం నిలిచిపోయిందన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫిబ్రవరి 9న భీమ్‌గల్ వచ్చిన పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, పట్టణాన్ని దత్తత తీసుకుంటానని, మూడు నెలల్లో రూ. 5 కోట్లు విడుదల చేయించి 100 పడకల ఆసుపత్రితో పాటు అన్ని పనులు పూర్తి చేస్తానని బహిరంగ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని నమ్మి ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని మున్సిపల్ ఛైర్మన్‌గా గెలిపించిన, మూడు నెలల గడువు ముగిసి ఆరు నెలలు కావస్తున్నా అదనంగా ఒక్క రూపాయి నిధులు తేలేకపోయారని విమర్శించారు.ప్రజారోగ్యం కోసం బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా అసెంబ్లీలో డిసెంబర్ 29ప్రభుత్వాన్ని నిలదీసిన ఫలితంలేదన్నారు.ఎన్నికల హామీ ప్రకారం మే 15 నాటికి పనులు కాకపోవడంతో జూన్ 14న క్షేత్రస్థాయి పరిశీలన జరిపి హెచ్చరించామని, స్పందన లేకపోవడంతో జూలై 14న ప్రభుత్వ కళ్లు తెరిపించేందుకు మంచి నీళ్లు కూడా ముట్టకుండా కఠోర నిరాహార దీక్ష చేపట్టానని వివరించారు. పోలీసులు నిర్బంధించిన ఇంట్లోనే దీక్ష కొనసాగించానన్నారు.ఆగస్టు 3న సెక్రటేట్ లో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేయగా, 10 రోజుల్లో నిధులు ఇస్తామని హామీ ఇచ్చి 15 రోజులు గడిచినా ఒక్క రూపాయి విడుదల చేయలేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఖజానాలో డబ్బులు లేవనే సాకు చెబుతున్న ప్రభుత్వం, బడ్జెట్‌లో అధికారికంగా మంజూరైన పనులను నిలిపివేయడం ముమ్మాటికీ ప్రజాద్రోహమని మండిపడ్డారు. ఇప్పటికే ఒక హెలికాప్టర్ ఉండగా నెలకు రూ. 5 కోట్లకు పైగా అద్దెతో ఏకంగా రూ.111 కోట్లు వెచ్చించి అదనపు హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకోవడం ఏ రకమైన పొదుపు అని ప్రశ్నించారు. సీ ఎం తన మనుమడి కోసం రూ.10 కోట్లతో ఫుట్‌బాల్ కోర్టులు, మెస్సీ పర్యటనల పేరిట ప్రచార ఆర్భాటాలకు వందల కోట్లు, అందాల పోటీలకు రూ.100 కోట్లు,శంషాబాద్ కనెక్టివిటీ ఉన్నప్పటికీ సొంత భూముల ధర పెరగడం కోసం కొడంగల్ నుండి శంషాబాద్ వరకు రూ.3,500 కోట్లతో 6 వరుసల రహదారిని చేపట్టడానికి వేల కోట్లు ఉంటాయి గానీ భీమ్‌గల్ 100 పడకల ఆసుపత్రి, మార్కెట్, రోడ్లు పూర్తి చేయడానికి అవసరమైన రూ.15 నుండి 20 కోట్ల నిధులు ఇవ్వడానికి చేతులు రావడం లేదా అని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే సూటిగా నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన 100 పడకల ఆసుపత్రి, సమీకృత మార్కెట్, ఆర్టీసీ బస్ డిపో, అంతర్గత సిసి /బిటి రోడ్డు పనులను పెండింగ్ బిల్లులు విడుదల చేసి తక్షణమే పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లకు రావాల్సిన రూ. 10 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి అన్ని పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఒక బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా అసెంబ్లీలో ప్రశ్నించిన, దీక్షలు చేసిన, మంత్రులను స్వయంగా కలిసిన ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని, భీమ్‌గల్ అభివృద్ధి సాధన కోసం తదుపరి ఏ రూపంలో పోరాటం చేయాలో భీమ్‌గల్ ప్రజలే నాకు మార్గదర్శనం చేయాలని పట్టణ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎంతటి ఉద్యమానికైన తాను సిద్ధమని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సయ్య, మాజీ జెడ్పిటిసి రవి, మాజీ ఎంపిపి మహేష్, జిల్లా కో అప్షన్ మొయిజ్, శర్మ నాయక్, తుకాజీ నాయక్, శివసారి నర్సయ్య,కౌన్సిలర్ నీలం రవి,స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిఓ నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలి

**ఐటీఐ-పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలను విలీనం చేయడం కాదు అభివృద్ధి చేయాలి**
**విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దు**

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఐటీఐ, డిప్లొమా విద్యా వ్యవస్థలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పిడి ఎస్ యు ఆధ్వర్యంలో బుధవారం నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా పీ డీ ఎస్ యు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, గౌతం కుమార్ లు మాట్లాడుతూ విలీనం వద్దు -- విద్యా వ్యవస్థలను బలోపేతం చేయాలి" జీఓ 97 రద్దు చేయాలని,", "విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి" అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. పోలీసులు విద్యార్థులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొంతసేపు విద్యార్థులకు పోలీసులకి మధ్య తోపులాట చోటుచేసుకుందనీ తెలిపారు. అనంతరం విద్యార్థులు కళాశాల గేటు దాటి రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారన్నారు.విలీనం కాదు, రెండు విద్యా వ్యవస్థల అభివృద్ధి కావాలి

ఐటీఐ విద్యకు, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యకు వాటి స్వంత విద్యా విధానం, శిక్షణా విధానం, కోర్సుల నిర్మాణం, నైపుణ్యాల లక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. రెండు విభిన్న విద్యా వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం వల్ల భవిష్యత్తులో విద్యా ప్రమాణాలు, కోర్సుల ప్రత్యేకత, ప్రయోగాత్మక శిక్షణ, విద్యార్థుల ఉన్నత విద్య--ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఐటీఐ కళాశాలలను, పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయడం గురించి కాకుండా రెండు వ్యవస్థలను విడివిడిగా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.



ఐటీఐలను బలోపేతం చేయడానికి కొత్త కోర్సులు, ఆధునిక యంత్రాలు, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేయకూడదనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

పాలిటెక్నిక్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులు, ఆధునిక ల్యాబ్‌లు, పరికరాలు, హాస్టల్ సౌకర్యాలు ఎందుకు కల్పించకూడదనీ ప్రశ్నించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాల్సిన ప్రభుత్వం విలీనాలపై కాకుండా ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక వసతులు, అధ్యాపకులు, ప్రయోగశాల లు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని పిడి ఎస్ యు డిమాండ్ చేసింది.

విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా జీఓనో 97ను అమలు చేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. జీఓ ను వెంటనే రద్దు చేసి, ఐటీఐ--పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు నిజామాబాద్ జిల్లా నాయకులు ప్రిన్స్, సృజన, మున్నా, పవన్, అరవింద్, రాజు, అర్జున్, ప్రశాంత్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## డిపో మేనేజర్ కు వినతి




మోర్తాడ్ బతుకమ్మలిమెట్ పల్లీ నుండి నిర్మల్ కు వయా డొంకల్, శెట్ పల్లీ, మెండోరా గ్రామాల మీదుగా ప్రయాణికుల సౌకర్యార్థం మరో బస్సు నడపాలని మెట్ పల్లీ డిపో మేనేజర్ హరి కు నాయకులు గురిజాల నర్సారెడ్డి, బడే నరేందర్ బుధవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. స్పందించిన డిపో మేనేజర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అధికారుల చొరవతో వారం రోజుల్లో బస్సు నడిపించే విదంగా ఏర్పాట్లు చేస్తానని చెప్పటం జరిగింది. కార్యక్రమం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ఫోటో ప్రాముఖ్యత ఎంతో కీలకం...

### ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు..



రుద్రూర్, ఆగస్టు 19 (అక్షర ఆయుధం న్యూస్) : సమాజంలో ఫోటో ప్రాముఖ్యత ఎంతో కీలకమని ఫోటో గ్రాఫీ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలో ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. లూయిస్ థాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ ఫోటో గ్రాఫీకి సంబంధించిన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ.. పుట్టుక నుండి చావు వరకు సమాజంలో ఫోటో ప్రాముఖ్యత ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యక్షులు సమీప్, కోశాధికారి సాయిలు, సభ్యులు మోహన్, శ్యామ్, బాబురావు, అశోక్, యం.డి. రుక్కుద్దీన్, రాజశేఖర్, వి.యం. గణేష్, శివ అప్ప, ఎం.డి. ఫహిమొద్దీన్, సాయికిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నుడా చైర్మన్ కేశ వేణు జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు






నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ నుడా చైర్మన్ కేశ వేణు జన్మదినం సందర్భంగా బుధవారం పలుచోట్ల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. కేశ వేణు అన్న యూత్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే నీలకంఠేశ్వర మందిరం, పాత మునిసిపల్ ఆఫీస్, వినాయకనగర్ రుక్మిణీ ఛాంబర్, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఈ నాలుగు చోట్ల అన్నదాన కార్యక్రమం చేశారు. అలాగే గుండారంలోని నిర్మల భవన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేశ మహేష్, సిరిగిరి తిరుపతి, బింగి మధు, కోర్వా రాజు, దేవిదాస్, ప్రవీణ్, సుజిత్, గాలి ప్రసాద్, ఆమీర్, నోమన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాన మురికి కాలువలో చెత్త వేస్తే జరిమానా..

### కాలువల్లో వ్యర్థాలు వేయొద్దు.. మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక.

### పునరావృతంగా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.

### పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి.







బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని ప్రధాన మురికి కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయడం ద్వారా నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ గోవు గంగాధర్ తెలిపారు. బాన్సువాడ పట్టణ ప్రజలు, వ్యాపారులు కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కాలువల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి మున్సిపల్ నిబంధనల ప్రకారం జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. నిబంధనలను పదేపదే ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాన్సువాడ పట్టణంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇళ్లలో, దుకాణాల్లో పేరుకుపోయే చెత్తను కాలువల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని ప్రజలకు సూచించారు. పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో విద్యా బోధన

### అధ్యాపకులకు శిక్షణ తరగతుల ముగింపు

### జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల లో ఇక నుండి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థినీ విద్యార్థులకు విద్య బోధన జరుగుతుందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. నిజామాబాద్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మూడవ విడత అధ్యాపకులకు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. అధ్యాపకులకు ఓరియంటేషన్ శిక్షణా తరగతులతో వృత్తి నైపుణ్యం పెరుగుతోందని, దీనివల్ల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి అన్నారు. మంగళ, బుధవారం మూడవ స్పెల్ లో మ్యాథ్స్, కెమిస్ట్రీ, బోటనీ సబ్జెక్ట్ శిక్షణ ముగింపు సందర్భంగా సభకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంధం బుద్దిరాజు అధ్యక్షత వహించారు. ఇంటర్ విద్యా అధికారి నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్లకు జరుగుతున్న శిక్షణా తరగతులను ఉదయం తనిఖీ చేశారు. సాయంత్రం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సాంకేతికపరమైన పరిజ్ఞానంతో విద్యా బోధన చేసేందుకు శిక్షణ పొందడం, పేద విద్యార్థుల అభ్యున్నతికి నిదర్శమని అన్నారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థులను భావితరాలకు ఉపయోగ పడే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి విద్యార్థి పైన వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ విద్యా బోధన చేయాలని ఆదేశించారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ రెండు రోజుల ఓరియంటేషన్ తరగతులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ లో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ అధ్యాపకులకు శిక్షణ, బోధనా మెళకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బుద్దిరాజ్, నిజామాబాద్ జిల్లా అబ్జర్వర్ ధర్మపాల్, జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నర్సయ్య తదిరులు పాల్గొన్నారు.

# బీర్కూర్‌లో రెండు ఇళ్లలో చోరీ కేసు ఛేదన.. నిందితుడి అరెస్ట్

### సాంకేతిక ఆధారాలతో ఏడాది తర్వాత కేసును ఛేదించిన పోలీసులు




బాన్సువాడ బతుకమ్మ : బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడాది క్రితం జరిగిన రెండు ఇళ్లలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీ, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి కర్ణాటకకు చెందిన సకత్ గోపిని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. 1 ఆగస్టు 2025 సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో బీర్కూర్‌లోని ఓ ఇంటి తాళం పగలగొట్టి, బీరువా తాళాలను ధ్వంసం చేసి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించారు. అదే రాత్రి ఎదురుగా ఉన్న మరో ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.2 వేల నగదును అపహరించారు. రెండు ఇళ్లలో చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.22 వేలుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాన్సువాడ డీఎస్పీ, బాన్సువాడ రూరల్ సీఐ పర్యవేక్షణలో బీర్కూర్ ఎస్సై ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కర్ణాటకకు చెందిన సకత్ గోపిని నిందితుడిగా గుర్తించారు. ఆగస్టు 19న మహారాష్ట్ర నుంచి బోధన్ వైపు వెళ్తున్న సమయంలో బరంగేడిగి గ్రామం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఏడాది క్రితం బీర్కూర్ పరిధిలో చోరీకి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి చోరీలకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సకత్ గోపిపై గతంలో కూడా చోరీ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. 2022లో బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసులో నిందితుడు రిమాండ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. కేసులో మిగిలిన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, ఫింగర్‌ప్రింట్, సీసీ కెమెరాల సహాయంతో నేరాలను ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

బతుకమ్మ

20 ఆగస్టు 2026 గురువారం

# ఉచిత కంటి వైద్య శిబిరంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## ఎంపీడీఓ సంతోష్ కుమార్

భీమ్ గల్, బతుకమ్మ :లయన్స్ క్లబ్ భీమ్ గల్--వేముగల్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిభిరంను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గోనుగొప్పుల గ్రామంలో లయన్స్ క్లబ్ అఫ్ భీమ్ గల్ బివేముగల్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ గ్రామ సర్పంచ్ చరణ్ తో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎంపీడీవో సంతోష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు . పేద ప్రజలకు కంటి సమస్యలు ఉంటే వైద్యం చేయించుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. ఈ శిభిరం కంటి శస్త్ర చికిత్స అవసరమైన ఉచితంగానే చెస్తారని, ఇట్టి అవకాశంను అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు 126 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 23 మందికి మోతిబిందు ఆపరేషన్ అవసరమని గుర్తించారు.
మోతిబిందు ఆపరేషన్ అవసరమైన వారిని లయన్స్ క్లబ్ భీమ్ గల్--వేముగల్లు ఆధ్వర్యంలో లయన్స్ కంటి ఆసుపత్రి ఆర్మూర్ కు తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని క్లబ్ మెంబెర్స్ తెలిపారు. ఆపరేషన్ అనంతరం పేషంట్ ను తిరిగి గ్రామానికి తీసుకువచ్చి ఇంటి వద్ద వదలడం



జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.
ప్రజలు లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.
ఈ కార్యక్రమంలో ఏపీవో నరసయ్య, శిబిరం ఇన్‌చార్జ్ లయన్. హనుమంతరావు, లయన్స్ అధ్యక్షుడు లయన్.డాక్టర్ పడాల పురందర్, ఉపాధ్యక్షుడు లయన్.టి. హనుమాన్లు, పీఆర్వో లయన్. పురస్తు బద్రి, లయన్ మంద గోవర్ధన్, లయన్ గాండ్ల సాగర్, లయన్ దని రమేష్, లయన్ ర్యాడా శ్రీనివాస్, లయన్ భూక్యా లింబాద్రి, వార్డు సభ్యులు,లయన్స్ క్లబ్ సభ్యులు, మాజీ సర్పంచ్ భోజగౌడ్,సెక్రటరీ శ్రీనివాస్,వార్డు సభ్యులు శేఖర్ , స్వామి నాయక్ , మహేష్ , హరీష్ ,గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు, మాతా శిశు మరణాలపై డిఎంహెచ్ ఓ సమీక్ష

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, మాత శిశు మరణాలు,జీవనశైలి వ్యాధులు , క్షయ వ్యాధి,వ్యాధి నిరోధక టీకాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత, నీటి ట్యాంకులను వారానికోసారి తప్పకుండా శుభ్రం చేస్తూ ప్రతిరోజు బ్లీచింగ్ పౌడర్ కలిపిన క్లోరినేషన్ వాటర్ ని తాగాలని, నీటి నిల్వలను తొలగించాలని, కాలి ప్లాట్లు, మురికినీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ ను వదలాలని, డెంగీ వ్యాధి వచ్చిన ఇంటి చుట్టూ 50 ఇళ్లలో పైరత్రం స్ప్రే చేయాలని, 100 ఇళ్ల వరకు టెమిఫాస్ స్ప్రే చేయాలనీ, ఇంటింటికి జర సర్వేను నిర్వహించి, ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రతిరోజు రక్త పరీక్షలను నిర్వహించాలన్నారు. యాంటీ లార్వల్ స్ప్రేను, ఫాగింగ్ ను నిర్వహించాలన్నారు. డెంగీ సోకిన వారూ ద్రవ ఆహారాలను తరచుగా తీసుకోవాలని, పారాసెటమాల్ మాత్రలు వేసుకుంటూ విశ్రాంతి తీసుకోవాలన్నారు, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజల్లో పాఠశాలలో, కళాశాలలో విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. నీటి కాలుష్యం వల్ల వ్యాపించే వ్యాధులను నీటి పరీక్ష కిట్లను ఉపయోగించి నీటి నాణ్యతను పరీక్షించాలన్నారు తద్వారా టైపాయిడ్ ,డయేరియా, అతిసారా ,కలరా మొదలగు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పడాలన్నారు, మాతా శిశు మరణాలను 10 లోపు ఉండేలా చర్యలు తీసుకోవాలి అన్నారు, చిన్నపిల్లల్లో క్షయ వ్యాధి నిర్ధారణ చేపట్టి చికిత్స అందించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహించే క్షయ నిర్ధారణ పరీక్షలను ప్రజలు వినియోగించుకోనేలా చూడాలని, క్షయ వ్యాధిగ్రస్తులు 6 నెలల చికిత్స కోర్సును వాడాలన్నారు, జీవనశైలి వ్యాధుల్లో భాగంగా 30 సంవత్సరాల పైబడిన వారిని హైపర్ టెన్షన్ మధుమేహం క్యాన్సర్ కోసం పినిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి అన్నారు. పరీక్షల కోసం పెండింగ్లో ఉన్న వారందరినీ పరీక్షించి ఏం ఓ లాగిన్ లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే చికిత్స తీసుకుంటున్న వారందరినీ లైన్ లిస్టు ద్వారా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల ద్వారా నియంత్రించే వ్యాధులను టీకాలు తీసుకోవడం ద్వారా నియంత్రించవచ్చున్నారు.



ఈ కార్యక్రమంలో డిటిసి ఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రావ్య, డిస్టిక్ ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ, ఎస్ ఓ రాజేశ్వర్, డిప్యూటీ డెమో దుర్గారావు, డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు వివిధ పీహెచ్సీల నుండి వైద్యాధికారులు, సిహెచ్ ఓలు, హెచ్ ఈ లు, హెచ్ ఇ ఓ లు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# కలహాలు లేకుండా కలిసి వెల్తేనే కలకాలం గుర్తుంటారు

### -ఎపిపి రహీమోద్దీన్ కు "బార్ "ఘనవీడ్కోలు







నిజామాబాద్ లీగల్, బతుకమ్మ న్యాయస్తానాలలో ప్రాసిక్యూషన్, డిఫెన్స్ కౌన్సిల్స్ మధ్య క్రిమినల్ కేసులలో వారివారి ప్రధాన్యతలదృష్ట్ర వాడివేడిగా వాదనలు జరుగుతాయని అవి కోర్టు గౌరవమర్యాదలకు అనుగుణంగా ఉంటాయని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠ రావు అన్నారు.పదకొండు సంవత్సరాల పైచిలుకు సుధీర్ఘకాలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహించిన అనంతరం హైదరాబాద్ ఎల్ బి నగర్ కోర్టుకు బదిలీపై వెళుతున్న మహమ్మద్ రహీమోద్దీన్ కు నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ కార్యాలయంలో శాలువా మెమోంటోతో సన్మానించి ఘనవీడ్కోలు పలికిన సందర్భంలో నీలకంఠ రావు మాట్లాడారు. ఆర్మూర్, బాన్స్ వాడ, బోధన్, బిచ్ కుంద, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులలో దాదాపు అన్ని కోర్టులలో విధులు నిర్వహించడం ముదావహమని అన్నారు. పోలీసుల తరపున బలంగా వాదనలు వినిపించడం ప్రాసిక్యూషన్ విధి అని అంతకంతకు బలంగా ముద్దాయిల తరపున వాదనలు వినిపించడం న్యాయవాదుల వృత్తి ధర్మమని ఎవరి పరిధిలో వారు పని చేసుకుంటు వెళతారని వెళ్లే క్రమంలో వ్యక్తిగత పట్టింపులకు తావు లేదని నీలకంఠ రావు తెలిపారు.ప్రాసిక్యూషన్ ప్రయోజనాల కోసం ప్రాసిక్యూటర్స్, డిఫెన్స్ న్యాయవాదులుగా న్యాయవాదులు ఎవరి ప్రయోజనాల కోసం వారు శ్రమిస్తారని అంతిమంగా కోర్టులు న్యాయ నిర్ణయం చేస్తాయని ఆయన తెలిపారు.
సీనియర్ న్యాయవాదులు మంతెన రాజేందర్ రెడ్డి, జివి కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ రహీమోద్దీన్ ను పాలమూరి పిల్లగాడిగా గానే చూశామని వృత్తిరీత్యా బార్ మధ్య తిరిగిన ఆయన తన వృత్తిలో నిబద్ధత్తతోనే మెదిలారని అన్నారు. న్యాయమూర్తులైన, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అయిన ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా వచ్చినవారిని కుటుంబ సభ్యుల మాదిరిగానే గౌరవించుకున్నామని వారు పేర్కొన్నారు.వృత్తిపరంగా వచ్చిన వారందరిని ఇంటికి అతిథులు వచ్చినతీరుగానే చూసి ఆదరించామని వారు గుర్తు చేశారు.అనంతరం బార్ తరపున రహీమోద్దీన్ దంపతులను మెమెంటో శాలువతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి,న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేధార్, షేర్ సుభాష్,మాణిక్ రాజు, పడిగల వెంకటేష్వర్, బైర గణేష్, ఎర్రం విగ్నేష్, పెండెమ్ రాజు, బిట్ల రవి, మెట్టు నరేష్ కుమార్,కవిత గంగోనే, ఇందుమతి,యునస్ ఖాన్, ఆశ నారాయణ, బోయిని సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్‌లో ఘనంగా ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం



వేల్పూర్, బతుకమ్మ :ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవ కార్యక్రమాన్ని ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. 187 వరల్డ్ ఫోటోగ్రాఫర్స్ డే సందర్భంగా లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లార్పించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ జమల గారి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ రాము, ట్రెజరర్ గంగాధర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బీర్కూర్‌లో రెండు ఇళ్లలో చోరీ కేసు ఛేదన.. నిందితుడి అరెస్ట్

### సాంకేతిక ఆధారాలతో

### ఏడాది తర్వాత కేసును ఛేదించిన పోలీసులు



బాన్సువాడ బతుకమ్మ : బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడాది క్రితం జరిగిన రెండు ఇళ్లలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీ, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి కర్ణాటకకు చెందిన సకత్ గోపిని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. 1 ఆగస్టు 2025 సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో బీర్కూర్‌లోని ఓ ఇంటి తాళం పగలగొట్టి, బీరువా తాళాలను ధ్వంసం చేసి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించారు. అదే రాత్రి ఎదురుగా ఉన్న మరో ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.2 వేల నగదును అపహరించారు. రెండు ఇళ్లలో చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.22 వేలుగా ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాన్సువాడ డీఎస్పీ, బాన్సువాడ రూరల్ సీఐ పర్యవేక్షణలో బీర్కూర్ ఎస్సై ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.ఈ క్రమంలో కర్ణాటకకు చెందిన సకత్ గోపిని నిందితుడిగా గుర్తించారు. ఆగస్టు 19న మహారాష్ట్ర నుంచి బోధన్ వైపు వెళ్తున్న సమయంలో బరంగేడిగి గ్రామం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఏడాది క్రితం బీర్కూర్ పరిధిలో చోరీకి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి చోరీలకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.సకత్ గోపిపై గతంలో కూడా చోరీ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. 2022లో బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసులో నిందితుడు రిమాండ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు.కేసులో మిగిలిన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, ఫింగర్‌ప్రింట్, సీసీ కెమెరాల సహాయంతో నేరాలను ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.